సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం, 10, మే, 2024



ఇంటర్ అడ్మిషన్లు షురూ..

2లో▸

జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఇంటర్మీడియెట్ విద్యా శాఖ పచ్చ జెండా ఊపింది. గురువారం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది.



అకాల వర్షం.. తడిసిన జొన్న

జిల్లాలో పలుచోట్ల గురువారం అకాల వర్షం కురిసింది. ఇచ్చోడ మార్కెట్ యార్డుకు తెచ్చిన జొన్నలు తడవగా ఆరబెట్టుకునేందుకు రైతులు నానాపాట్లు పడ్డారు.

3లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/29.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఈగా జేఆర్ చౌహాన్



జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా జేఆర్ చౌహాన్ నియమితులయ్యారు. నిర్మల్ ఎస్‌ఈగా పనిచేస్తున్న ఆయన గత నాలుగు నెలలుగా ఆదిలాబాద్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఈ సంపత్ అనంతపూర్‌కు బదిలీపై వెళ్లగా అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం నిర్మల్ జిల్లా నుంచి చౌహాన్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు.

48 గంటల ముందునుంచే నిశ్శబ్దకాలాన్ని పాటించాలి

కైలాస్‌నగర్: పోలింగ్‌కు 48గంటల ముందు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అన్ని కార్యకలాపాలు నిలిపివేసి నిశబ్ధకాలాన్ని పాటించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజున, పోలింగ్‌కు ఒకరోజు ముందు (ఈ నెల 12, 13తేదీల్లో) ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురించకూడదని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఇతరులెవరైనా ముందస్తుగా ఎంసీఎంసీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పొందాలని సూచించారు. లేనిపక్షంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

సమస్యలు లేకుండా చూడాలి



వివరాలు తెలుసుకుంటున్న రాజేంద్రవిజయ్

ఇంద్రవెల్లి: పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూడాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అధికారులు, బీఎల్వోలతో మాట్లాడి కేంద్రాల్లోని సమస్యలు, సౌకర్యాలు, ఓటర్ల వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఉదయమే కేంద్రాలకు వచ్చేలా అవగాహన కల్పించాలని, 95–100 శాతం పోలింగ్ జరిగేలా కృషి చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి సమస్యలుంటే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో జీవకర్‌రెడ్డి, సీఐ మొగిలి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సునీల్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఈవో సంజీవ్‌రావ్ తదితరులున్నారు.

షాడో పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కైలాస్‌నగర్: షాడో పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ సమస్యలుంటే సంబంధిత అధికారులకు తెలుపాలని జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. వెబ్‌కాస్టింగ్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్‌లలో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందితో గురువారం తన కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. మాక్ పోలింగ్‌ను ఉదయం 5.30కు ప్రారంభించి 6.30గంటల కల్లా పూర్తి చేయాలని తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోల్ పూర్తయిందా.. లేదా.. తెలుసుకోవాలని పేర్కొన్నారు. సెక్టోరల్ అధికారులు పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ సిబ్బందికి తెలుపాలని సూచించారు. సిబ్బంది పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు డాటా ఎంట్రీ చేయాలని తెలిపారు. పోలింగ్ పూర్తయ్యాక సిబ్బంది బయలుదేరే సమయాన్ని కూడా తెలుసుకోవాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞా మాల్వియా, కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్, సూపరింటెండెంట్లు నలంద ప్రియా, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నిఘా నిరంతరం..

- పకడ్బందీగా ఎంపీ ఎన్నికల ప్రక్రియ
- 1,837 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- కలెక్టరేట్ ఆఫీసుల్లో కంట్రోల్‌రూంలు
- వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రక్రియ పరిశీలన

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఎన్నికల ప్రక్రియను కలెక్టరేట్‌ల నుంచి అధికారులు నేరుగా పర్యవేక్షించేందుకు వీలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని 1,837 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించిన అధికారులు వాటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆయా జిల్లా కేంద్రాల్లోని కంట్రోల్ రూంల నుంచి పర్యవేక్షించేలా వెబ్‌కాస్టింగ్ చేయనున్నారు. ఈ బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన బృహస్పతి సంస్థకు అప్పగించారు. పోలింగ్‌కు ఒక్కరోజు ముందుగా ఆ సంస్థ ఆధ్వర్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చి వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. తద్వారా పోలింగ్ కేంద్రాల్లో ఏ చిన్నపాటి అవాంఛనీయ ఘటన జరిగినా అధికారులకు క్షణాల్లో తెలిసి దానిపై చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న సీసీ కెమెరాల వివరాలు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	లోపల	బయట
సిర్పూర్	320	245	168
ఆసిఫాబాద్	356	253	145
ఆదిలాబాద్	292	232	128
బోథ్	306	181	131
ఖానాపూర్	309	309	40
నిర్మల్	306	306	39
ముధోల్	311	311	26

ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో 16,50,175 మంది ఓటర్లున్నారు. వీరి కోసం అధికారులు 2,200 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 13న నిర్వహించే పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో వంద శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 60శాతం పోలింగ్ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గ పరిధిలో 1,837 సమస్యాత్మక కేంద్రాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈసీ ఆదేశాల మేరకు వీటిలో లోపల, బయట రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పోలింగ్‌స్టేషన్ పరిధిలో 2–5 కేంద్రాలుంటే కెమెరాలు తగ్గించారు. ఇలాంటి 677 కేంద్రాల్లో 677 కెమెరాలు బయట ఏర్పాటు చేస్తారు.

కంట్రోల్‌రూమ్‌ల నుంచే పర్యవేక్షణ

పోలింగ్ కేంద్రాల్లోని ఎన్నికల ప్రక్రియతో పాటు అక్కడి పరిస్థితులను వెబ్‌కాస్టింగ్ ద్వారా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలను వీక్షించేందుకు వీలుగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ కలెక్టర్ కార్యాలయాలతో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులైన ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లోని ఆర్డీవో కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా సాధారణ, పోలీస్ పరిశీలకులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు కంట్రోల్ రూంలలో అందుబాటులో ఉండి తమ పరిధిలోని పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షించనున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినా, ఈవీఎంలు మొరాయించినా తక్షణ చర్యలు చేపట్టనున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేలా పోలీస్ బలగాలను రంగంలోకి దింపనున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తి నిఘా నీడలో సాగనుంది.

‘రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దుకు కుట్ర’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, పక్కన ఇతర నాయకులు

కైలాస్‌నగర్: రాజ్యాంగంతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీల రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకుడు రాములునాయక్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచేందుకే బీజేపీ కులాలు, మతాల వారీగా ప్రజలను విభజించే కుట్ర చేస్తోందని విమర్శించారు. పదేళ్ల పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసేందుకు ఇష్టపడని మాజీ సీఎం కేసీఆర్ బస్సుయాత్ర పేరిట ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగవుతుందని తెలిపారు. కాంగ్రెస్ మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసిన గోడం నగేశ్ చేసిందేమీలేదని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, రాందాస్‌నాయక్ తదితరులున్నారు.

కాంగ్రెస్ బైక్ ర్యాలీ



ర్యాలీలో అభివాదం చేస్తున్న మంత్రి సీతక్క

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా చేపట్టిన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రజాసేవ భవన్ నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల గుండా అంబేడ్కర్ చౌక్ వరకు కొనసాగింది. పార్టీ కార్యకర్తలు బైక్‌లపై వెళ్లగా, మంత్రి సీతక్క ఓపెన్‌టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. కార్యకర్తలు కాంగ్రెస్ జెండాలను పట్టుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకగా ఆత్రం సుగుణను పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించినా నేరమే

గుడిహత్నూర్: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమేనని ఐసీడీఎస్ పీవో వనజ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వరక్ష డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను భారంగా భావించవద్దని, ప్రభుత్వం అనేక పథకాల ద్వారా బాలికల చదువు, ఉద్యోగం, వివాహాలకు తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. మండల వైద్యాధికారి శ్యాంసుందర్ బాల్య వివాహాల కారణంగా వచ్చే అనర్థాలను వివరించారు. డీసీపీయూ జిల్లా అధికారి కుట్ల రమేశ్, బాలల సంరక్షణశాఖ సిబ్బంది పీ పద్మ, అశ్విని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, సీసీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న సాయన్న, అధికారులు

తాంసి: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీవో సాయన్న హెచ్చరించారు. భీంపూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉపాధి పనులపై మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పీడీ సాయన్న హాజరై మండలంలోని 26 గ్రామపంచాయతీల పరిధిలో 2023–24 వరకు రూ.2.14 కోట్లతో చేపట్టిన 235 పనులపై సమీక్ష నిర్వహించారు. వివిధ గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో సాయన్న మాట్లాడుతూ.. సిబ్బంది పనులు పారదర్శకంగా చేపడుతుండటంతో చిన్నచిన్న పొరపాట్లు మినహా ఎలాంటి అవకతవకలు జరగలేదని తెలిపారు. ప్రస్తుతం భీంపూర్ మండలంలోని 26 పంచాయతీలకు గాను సరాసరి 134 మంది కూలీలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం కూలీల సంఖ్య 200 దాటుతుందని తెలిపారు. ప్రతీ కూలీకి 100 రోజులకు తగ్గకుండా పని కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు వివరించారు. కూలీలకు పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు కుటుంబరావు, కృష్ణారావు, ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డి, కవిత, వీణ, ఏపీవో సంగీత, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచాలి



ఆటోకు పోస్టర్ అతికిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఈ నెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసి పోలింగ్ శాతాన్ని పెంచాలని ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞ మాల్వియా సూచించారు. స్వీప్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఓటు వినియోగంపై వంద ఆటోలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఆటోలకు పోలింగ్ తేదీతో కూడిన స్టిక్కర్లను అతికించారు. తామంతా ఓటు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, దానిని వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్, ఏఎంవీఐ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే రిమ్స్‌కు రెఫర్ చేయాలి

- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్
- వైద్యాధికారులతో సమావేశం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: అత్యవసరమైతేనే రోగులను రిమ్స్‌కు రెఫర్ చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో వైద్యాధికారులతో సమావేశమై మాట్లాడారు. పీహెచ్‌సీలు, ఏరియాస్పత్రుల్లో 12 రకాల సేవలందించాలని ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రావడానికి రోగులు ఇబ్బందులు పడతారని, వారికి స్థానికంగానే సేవలందించాలని సూచించారు. ప్రసవం, చిన్నపిల్లల వైద్యం, కంటి, చెవి, ముక్కు, గొంతు తదితర సమస్యలతో వచ్చేవారికి సేవలందించాలని తెలిపారు. మద్యం, గంజాయి, ఇతర వ్యసనాలకు అలవాటు పడితే నయం చేయడానికి టెలీమానస్ నంబర్ 14416కు ఫోన్ చేయాలన్నారు. రిమ్స్‌లో డీఎంహెచ్‌పీ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎవరికైనా జీవితంపై విరక్తి కలిగితే మానసిక వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. వైద్యాధికారులకు మానసిక వైద్యనిపుణుడు ఓంప్రకాశ్, దంత వైద్యుడు వినోద్, ఈఎన్టీ వైద్యుడు షోహెబ్, కంటి సమస్యలపై సౌమ్య శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ప్రోగ్రాం అధికారి శ్రీధర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆదర్శం’ దిశగా బడులు

- జిల్లాలో 664 పాఠశాలలకు నిధులు
- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- రూ.4.98 కోట్ల నిధులు విడుదల



తాంసి మండలం గుబిడిపల్లి పాఠశాలలో ఆధునికంగా తీర్చిదిద్దిన కుళాయి పాయింట్



జైనథ్ మండలం ఆకుర్ల పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న అధికారులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు బడికి వెళ్లిన వారికి సమస్యలు ఎదురుకాకుండా ఉండేందుకు ముందుకు సాగుతోంది. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పేరిట ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. బడులు తెరిచే నాటికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తోంది. జిల్లాలో డీఈవో పరిధిలో 702 పాఠశాలలు ఉండగా 664 పాఠశాలలకు మౌలిక వసతుల కల్పన, ఇతర మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసింది. కార్పొరేట్ తరహాలో పాఠశాలలను తీర్చిదిద్దే దిశగా ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే పలు పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించగా, మిగతా పాఠశాలల్లో జూన్ నాటికి సౌకర్యాలు కల్పించనున్నారు.

మౌలిక వసతుల కోసం..

జిల్లాలో డీఈవో పరిధిలో 702 పాఠశాలలున్నాయి. వీటిలో 678 ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య పాఠశాలలుండగా, 17 కేజీబీవీలు, ఆరు మోడల్ స్కూళ్లు, ఒక యూఆర్‌ఎస్ పాఠశాల ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో తాగునీరు, చిన్నపాటి మరమ్మతులు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుద్దీకరణ, బాలికల మరుగుదొడ్లు, ఇతర పనులు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సమాఖ్య మహిళా సంఘాలు, పట్టణ ప్రాంతాల్లో ఏఎల్‌ఎఫ్ (ఏరియా లెవల్ ఫెడరేషన్) ద్వారా పనులు ప్రారంభమయ్యాయి.

25శాతం నిధులు విడుదల..

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 664 బడుల్లో పనులు చేపట్టేందుకు విద్యాశాఖ ప్రణాళిక తయారు చేసింది. ఇప్పటికే సంబంధిత గ్రామ సమాఖ్య సంఘం అధ్యక్షురాలు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పేరిట అకౌంట్లు ప్రారంభించారు. పాఠశాలలకు అవసరమైన పనులు అంచనా వేశారు. అయితే వీటిలో ఇప్పటికే 16 పాఠశాలల్లో మన ఊరు–మనబడి ద్వారా మౌలిక వసతులు కల్పించారు. మిగతా పాఠశాలల్లో ఏయే పనులు చేపట్టాలో.. ఎలాంటి సమస్యలున్నాయో గుర్తించారు. వీటి కోసం ప్రభుత్వం 25 శాతం నిధులు విడుదల చేసింది. రూ.20 కోట్ల 2 లక్షల 72వేల నిధులు అవసరమని అంచనా వేయగా, 25 శాతం నిధులు రూ.4కోట్ల 98లక్షల 89వేలు విడుదల చేసింది. 639 పాఠశాలల్లో పనులు ప్రారంభం కాగా, 45 పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించి పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు.

సమస్యల పరిష్కారానికే..

జిల్లాలోని సర్కారు బడులు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీలు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. రెండేళ్ల కిందట మన ఊరు–మనబడి ద్వారా మౌలిక వసతుల కోసం పనులు చేపట్టినా దాదాపు 20లోపు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. అయితే ప్రస్తుతం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. చిన్నచిన్న సమస్యలు పరిష్కారం కానున్నాయి. త్వరలో ప్రభుత్వం పాఠశాలలకు రంగులు వేయడం, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ చాక్‌బోర్డులు, సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అన్ని వసతులు కల్పిస్తాం



అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నాం. తాగునీరు, మరుగుదొడ్లు, చిన్నచిన్న మరమ్మతులు తదితర పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 25శాతం నిధులు విడుదలయ్యాయి. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– ప్రణీత, డీఈవో

ఆదివాసీల అభివృద్ధికి కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్
- జిల్లాకేంద్రంలో ఆదివాసీలతో నిర్వహించిన సమావేశానికి హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదివాసీల అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివాసీలతో సమావేశమై మాట్లాడారు. 75 ఏళ్లలో ఎన్నడూ ఆదివాసీల గురించి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పట్టించుకోలేదని ఆరోపించారు. ఆదివాసీ మహిళను తమ ప్రభుత్వం రాష్ట్రపతిని చేసిందని గుర్తు చేశారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఎన్నో పదవులు అనుభవించి మంచిపేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. గోడం నగేశ్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ ప్రభారి అల్జాపురే శ్రీనివాస్, నాయకులు జ్యోతిరెడ్డి, ముకుంద్, మయూర్ చంద్ర, పాయల్ శరత్, మటోలియా, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల నియమావళి ఉల్లంఘనులపై కేసు

ఖానాపూర్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ నిర్వహణ కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు అనుమతి ఇవ్వగా 7 గంటల 22 నిమిషాల వరకు కార్యక్రమం నిర్వహించడంతో నియమావళి ఉల్లంఘన కిందికి వచ్చిందన్నారు. దీంతో వీఎస్‌టీ–2 టీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌తో పాటు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఖానాపూర్‌లో రూ.500 నకిలీ నోటు కలకలం


నకిలీ నోటును చూపుతున్న బాధితుడు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో గల ఎస్బీఐ ఏటీఎంలో రూ.500 నకిలీ నోటు రావడం కలకలం రేపింది. పట్టణంలోని ఇంద్రానగర్ ఎస్సీ కాలనీకి చెందిన ద్యావతి గంగాధర్ ఏటీఎంలో డబ్బులు డ్రాచేసి బ్యాంకులో డ్వాక్రా లోన్ చెల్లించేందుకు తీసుకెళ్లగా అధికారులు గుర్తించి నకిలీ అని తేల్చారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

జీజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వైద్యపరికరాలు, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. ఇటీవల వీచిన ఈదురుగాలులకు ఆస్పత్రికి విద్యుత్ సరఫరా చేసే స్తంభం నేలవాలింది. షార్ట్ సర్క్యూట్ జరిగి ఆస్పత్రిలోని ఆరు కంప్యూటర్లు, మూడు ఈసీజీ మిషన్లు, ఐదు మల్టీప్యారా మీటర్లు, రెండు ఎబాస్ మిషన్ అడాప్టర్లు, విద్యుత్ కంట్రోల్ ప్యానల్, ఫ్యాన్లు, లైట్లు, సీసీ కెమెరాలు, రెండు సిరంజి పంపులు, ఒక వెంటిలేటర్ ఎయిర్ కంప్రెషర్, ఇంటర్నెట్ రూటర్‌లు పాడైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి తెలిపారు. రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గణేశ్ రఫీక్ అనే వ్యక్తితో మద్యం తెప్పిస్తూ కాలనీలో అమ్మకాలు జరుపుతున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ వైపు నుంచి 10 లీటర్ల మద్యం తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రామాలయంలో చోరీ

జన్నారం: మండలంలోని రేండ్లగూడ రామాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలోనికి ప్రవేశించి ప్రధాన ద్వారం పగులగొట్టే ప్రయత్నం చేశారు. తలుపులు తెరుచుకోకపోవడంతో హుండీని అపహరించుకుపోయారు.

ఇంటర్ అడ్మిషన్లు షురూ..

- ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ
- ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ప్రవేశాలు
- ఉమ్మడి జిల్లాలో 254 కళాశాలలు

నిర్మల్‌ఖిల్లా: జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ పచ్చజెండా ఊపింది. గురువారం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ పరిధిలోని జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 32వేలకు పైగా మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి.

రెండేళ్ల కోర్సులు

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రైవేట్, టీఎస్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ, కేజీబీవీ, టీఎమ్ఆర్జేసీ, టీఎస్ మోడల్ జూనియర్ కాలేజీల్లో రెండేళ్ల ఇంటర్ కోర్సులు అందిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు, ఒకేషనల్ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎమ్మెల్టీ, ఫ్యాషన్ డిజైనింగ్, క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంటు, అకౌంట్స్ అండ్ టాక్సేషన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

అడ్మిషన్ల ప్రక్రియ ఇలా....

ఇంటర్ ఫస్టియర్ తరగతులు జూన్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన టీసీ, స్టడీ సర్టిఫికెట్, తాత్కాలిక టెన్త్ మార్కుల మెమో ఆధారంగా ప్రిన్సిపాల్‌లు ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తారు. ఒరిజినల్ ఎస్సెస్సీ సర్టిఫికెట్ సమర్పించిన తర్వాత అడ్మిషన్లు నిర్ధారిస్తారు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 29 శాతం, పీహెచ్ 5 శాతం, ఎన్సీసీ, స్పోర్ట్స్ కోటా 5శాతం, ఎక్స్ సర్వీస్‌మెన్ 3శాతం, ఈడబ్ల్యూఎస్ 10 శాతం సీట్లు కేటాయిస్తారు. 33.3 శాతం అంటే 1/3 వంతు సీట్లు బాలికలకు రిజర్వ్ చేస్తారు. పదో తరగతిలో పొందిన గ్రేడింగ్ ఆధారంగా అడ్మిషన్లలో ప్రాధాన్యతనిస్తారు. తెలంగాణ ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన అనుబంధ కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు పొందాలని అధికారులు సూచిస్తున్నారు. అందుబాటులో ఉన్న కాలేజీల జాబితాను అధికారిక వెబ్‌సైట్ tsbie. cgg. gov. in చూడవచ్చు.


నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (ఫైల్)

షెడ్యూల్ ఇలా...
తొలి విడత అప్లికేషన్లు జారీ : 9-5-2024
దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ : 31-5-2024
తరగతుల ప్రారంభం : 01-06-2024
అడ్మిషన్లు పూర్తయ్యే తేదీ : 30-6-2024

జిల్లాల వారీగా వివరాలు

జిల్లా	పదో తరగతి ఉత్తీర్ణులు	ఇంటర్ కాలేజీలు (ప్రభుత్వ, గురుకుల,ప్రైవేటు)
నిర్మల్	8,823	63
ఆదిలాబాద్	9,641	66
మంచిర్యాల	8,579	77
కుమరంభీమ్	5,325	48

సద్వినియోగం చేసుకోవాలి...



ఇంటర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పదవ తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తమకు నచ్చిన కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చు. అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీలోనే చేర్పించాలి. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించి ఆర్థికంగా నష్టపోకూడదు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే నాణ్యమైన విద్య ఉచితంగా లభిస్తుంది.

– జాదవ్ పరశురాం, డీఐఈఓ, నిర్మల్ జిల్లా

బైక్‌పై ఎమ్మెల్యే ప్రచారం


బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే

లోకేశ్వరం: ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గురువారం మండలంలోని అబ్దుల్లాపూర్ నుంచి ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోటుకు బైక్‌పై వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పనిస్థలానికి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేక పోవడంతో బైక్‌పై ప్రయాణించారు. బీజేపీ తరఫున బరిలో దిగిన గోడం నగేష్‌ను గెలిపించాలని కోరారు.

వ్యాపారి అదృశ్యం

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి నాగమల్ల సురేష్ ఈ నెల 6న అదృశ్యమైనట్లు టౌన్ ఎస్సై అంజయ్య గురువారం తెలిపారు. చిట్ ఫండ్ వ్యాపారం నిర్వహించే సురేష్ ఇతరుల నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిళ్లు వస్తుండడంతో తట్టుకోలేక ఇంటినుంచి వెళ్లిపోయాడన్నారు. వ్యాపారి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మొగులు.. గుబులు


కమ్ముకొస్తున్న మబ్బులతో రైతుల్లో గుబులు మొదలైంది. గురువారం మండలంలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరిధాన్యంపై రైతులు ముందస్తు జాగ్రత్తగా టార్పాలిన్లు కప్పుకున్నారు. - పెంబి

ఇసుక లారీ పట్టివేత

చెన్నూర్: పట్టణంలోని జాతీయ రహదారిపై గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంది. వాహనాల తనిఖీలో భాగంగా లారీని తనిఖీ చేయగా డ్రైవర్ మనోరంజన్ హజ్రా వద్ద ఎలాంటి వేబిల్లు లభించలేదు. దీంతో లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్ మనోరంజన్ హజ్రాతో పాటు లారీ యాజమాని జంగ రవిచంద్రారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. కాగా నెలరోజుల క్రితం ఇదే లారీ పట్టుబడినట్లు సీఐ తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్: ఒకరిపై దాడి చేసిన కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం తల్వేద గ్రామానికి చెందిన రొడ్డ ఎర్రన్న ఇంటి ముందు 2016 నవంబర్ 12న అదే గ్రామానికి చెందిన గడ్డం రాజు, అతని తండ్రి గంగన్న చెత్త పారేయడంతో వారిని ప్రశ్నించాడు. దీంతో అతనిపై దాడిచేసి గాయపర్చారు. బాధితుడు నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై అరిఫొద్దీన్ కేసు నమోదు చేశారు. ఏపీపీవో రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ నిందితులు గడ్డం రాజు, గంగన్నకు ఐదునెలల సాధారణ జైలు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు.

ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి మహిళ మృతి

కౌటాల: మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన చునార్‌కార్ మీరాబాయి (58) ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి మృతి చెందిందని ఎస్సై ఎన్.మధుకర్ గురువారం తెలిపారు. మీరాబాయి బుధవారం గ్రామ శివారులోని తమ చేనులో మిర్చి తెంపేందుకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పెన్‌గంగలో మృతదేహాన్ని గుర్తించారు. నదిలో నీటిని తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు మోరేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

జైపూర్: ఈ నెల 2న అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహాన్ని గురువారం మండలంలోని ఇందారం రైల్వేట్రాక్ సమీపంలోని చెట్లపొదల్లో పోలీసులు గుర్తించారు. మంచిర్యాల రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పాగిల్ల యాదగిరి తల్లి కొండమ్మ(70) మతిస్థిమితం కోల్పోయి ఈ నెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. ఈ నెల 6న మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఫి ర్యాదు చేశారు. వృద్ధురాలు మృతదేహాన్ని గు ర్తించిన పోలీసులు మంచిర్యాల పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుపై ఆరా తీయగా కొండమ్మగా నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

చిల్లరకు బదులు సరుకులు

- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న బీపీఎం
- ఇబ్బందులు పడుతున్న పింఛన్ లబ్ధిదారులు


సబ్బులు చూపిస్తున్న బోసు మైసయ్య

పెంబి: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు రూ.2,016, దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ అందజేస్తోంది. అయితే మందపల్లి బీపీఎం రూ.16 చిల్లర లేదంటూ లబ్ధిదారులకు సబ్బులు, సర్ఫులు, అగ్గిపెట్టెలు, తదితర కిరాణ సామాను అంటగడుతున్నాడని బాధితులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు బోసు మైసయ్య గురువారం పింఛన్ తీసుకునేందుకు మందపల్లిలోని బీపీఎం చంద్రశేఖర్ వద్దకు వెళ్లగా రూ.4 వేలు ఇచ్చి మిగతావి చిల్లరలేదంటూ సబ్బులు, అగ్గిపెట్టెలు ఇచ్చాడు. అంతే కాకుండా రెండు మూడు రోజులు మాత్రమే పింఛన్ ఇస్తానని, లేదంటే మరో నెలవరకు ఆగాల్సిందేనని చెప్పడంతో దివ్యాంగుడైన మైసయ్య నాగాపూర్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మందపల్లికి బస్సులో వెళ్లి అక్కడి నుంచి అర కిలోమీటర్ దూరం వరకు నడుచుకుంటూ వెళ్లాడు. నడవలేని స్థితిలో ఉన్న తనకు ఇంటివద్దే ఇవ్వాల్సి ఉండగా అలా ఇవ్వడంలేదని, తీరా ఇక్కడికి వచ్చినా చిల్లర లేదంటూ కిరాణ సరుకులు అంటగడుతున్నాడని వాపోయాడు. చిల్లర ఇవ్వకపోవడమే కాకుండా అమర్యాదగా మాట్లాడుతున్న బీపీఎంపై చర్యలు తీసుకోవాలని పింఛన్ లబ్ధిదారులు కోరుతున్నారు.

తరుగు పేరిట కోత విధించొద్దు


లెఫ్ట్‌పోచంపాడ్ శివారులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

- కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి
- రైతులకు నష్టం జరగకుండా చూడాలని వినతి

సోన్: కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట ధాన్యంలో కోత విధించొద్దని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెల్మల్, సిద్దులకుంట, లెఫ్ట్‌పోచంపాడ్, పాక్‌పట్ల, జాఫ్రపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గోదావరిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. పని ప్రదేశంలో ట్రాక్టర్లను వినియోగించడంపై ఎమ్మెల్యే.. ఏపీవోతో ఫోన్‌లో మాట్లాడారు. తాము నిబంధనల ప్రకారం పనులు చేయిస్తున్నామని ఏపీవో సమాధానమిచ్చారు. అనంతరం కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పేరిట క్వింటాల్‌కు ఐదుకిలోలు కోత విధిస్తున్నారని పలువురు రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయమై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నిబంధనల ప్రకారం తూకం వేయాలన్నారు. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, హరీశ్‌రెడ్డి, గంగన్న, రమేశ్ రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహాలపై దాడి

- నిర్వాహకుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హౌజింగ్ బోర్డు, టీచర్స్ కాలనీతో పాటు పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నిర్వహిస్తున్న మూడు వ్యభిచార గృహాలపై పోలీసులు దాడి చేశారు. గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురు మహిళలు, తొమ్మిది మంది పురుషులు ఉన్నారన్నారు. ఇందులో కపిల్ అనే వ్యక్తి పరారీలో ఉండగా మిగితా వారిని అరెస్టు చేశామన్నారు. న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన హెచ్.వంశీకృష్ణ, ఎస్.అశోక్, కాలనీకి చెందిన కే.బాబాసాహెబ్ వ్యభిచార గృహం నిర్వహిస్తుండగా కపిల్ అనే వ్యక్తి మహిళలను రవాణా చేస్తున్నారన్నారు. టీచర్స్ కాలనీలో అదే కాలనీకి చెందిన ఎస్.రవితేజ, గుడిహత్నూర్ మండలం మన్నూర్‌కు చెందిన విశాల్ వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గుడిహత్నూర్ మండలానికి చెందిన షేక్ సలీం, మహాలక్ష్మివాడకు చెందిన అద్నాన్ అహ్మద్, ఎండీ అజీముద్దీన్ వ్యభిచార గృహాలు నిర్వహిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.7,500 నగదు, 11 సెల్‌ఫోన్‌లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై 137, 138 సెక్షన్‌లతో పాటు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 166, అండర్ సెక్షన్ 3, 4, 5 ఎమోరల్ ట్రాఫిక్ ప్రివెన్షన్ యాక్ట్ 1956 కేసులు నమోదు చేశామన్నారు. బాధిత మహిళలకు పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్, టూటౌన్ సీఐ అశోక్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ ఇవ్వలేదని విద్యార్థి బలవన్మరణం

సారంగపూర్: సెల్‌ఫోన్ ఇవ్వలేదని విద్యార్థి బలవన్మరణం చెందిన సంఘటన మండలంలోని బోరిగాంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన జట్ల రాజేశ్వర్–లక్ష్మి దంపతుల దత్తత కుమారుడు రాకేష్ (13) సెల్‌ఫోన్‌లో రీల్స్, ఇతర సోషల్ మీడియా పోస్టులకు అలవాటు పడ్డాడు. దీంతో పాటు అందులో వచ్చే గేమ్స్ ఆడటం, వాటికి తగ్గట్లుగా ప్రవర్తించేవాడు. రెండురోజులుగా అతనికి సెల్‌ఫోన్ ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో ఎస్సై చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

కుంటాల: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రజనీకాంత్ తెలిపి న వివరాల మేరకు మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన కొండూరి గంగాధర్ (63)కు 30 ఏళ్ల క్రితం అతని భార్యతో విడాకులయ్యాయి. అప్పటినుంచి ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరి గున్నాల పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


విఠల్ (ఫైల్)

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ డి.విఠల్ (60) బుధవారం రాత్రి వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం ఉపాధిహామీ పనులకు వెళ్లిన విఠల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు భైంసా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య సావిత్రిబాయి, కుమార్తె లలిత ఉన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ఘనత మోదీదే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పూర్తిమెజార్టీ ఉన్నా పదేళ్లలో ఏనాడు మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేయలేదని, అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత మోదీకే దక్కుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. నిర్మల్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. పదేళ్లు పారదర్శక పాలన సాగించిన మోదీని విమర్శించే అంశం లేకపోవడంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన మాదిగలు రిజర్వేషన్ల ప్రయోజనం పొందేలా ఎస్సీ వర్గీకరణకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వబోమని హామీ ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, మాజీ కౌన్సిలర్ నూతన భూపతిరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ అయ్యన్న గారి రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, బీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

భూగర్భ గనిలో పనికి భయపడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఉద్యోగం చేయలేక ఓ సింగరేణి కార్మికుడు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హమాలివాడకు చెందిన ఊరుగొండ ఓదెలు సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ అయి రెండో కు మారుడు సాయికుమార్(27)ను పనిలో పె ట్టించాడు. గత నెల 20న ఆర్జీ–1 గోదావరిఖని మైన్‌లో బదిలీ వర్కర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి సాయికుమార్ తరచూ తండ్రితో నాన్న నాకు మైన్‌లో దిగాలంటే భయంగా ఉంది.. నేను ఉద్యోగం చేయలేనంటూ మొరపెట్టుకునేవాడు. కొన్ని రోజు లు కష్టపడితే ఓపెన్‌కాస్ట్‌లో పెట్టిస్తానని తండ్రి ధైర్యం చెప్తూ వచ్చాడు. గురువారం డ్యూటీకి వెళ్లిన సాయికుమార్ రైలు ప ట్టాలపై శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రిపుల్.. ట్రబుల్

- వర్సిటీని వేధిస్తున్న నిధుల కొరత
- చాలా బిల్లులు పెండింగ్‌లోనే
- నాలుగేళ్లుగా మొక్కుబడిగా కేటాయింపులు
- సీట్ల కుదింపు ఆలోచనలో అధికారులు
- ప్రభుత్వం దృష్టి సారిస్తేనే పరిష్కారం



భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ ఇప్పటి వరకూ విడుదల కాలేదు. ఏప్రిల్ 30న పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులనే బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో చేర్చుకుంటారు. ఏటా అడ్మిషన్లకు సంబంధించి కమిటీ వేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కమిటీ వేయనట్లు సమాచారం. పైగా గతేడాది 1500 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఈ ఏడాది 500 సీట్లు తగ్గిస్తారని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ట్రిపుల్‌ఐటీని నిధుల కొరత వెంటాడుతున్నట్లు తెలిసింది. ఏపీలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలకు నోటిఫికేషన్ రావడంతో విద్యార్థులంతా బాసరలోనే నోటిఫికేషన్ వచ్చిందని పొరపాటుపడుతున్నారు. ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ నోటిఫికేషన్ సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది. అందులో పూర్తిగా చదివితే ఏపీ నోటిఫికేషన్ అని తెలిసి మన బాసర నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందని అడుగుతున్నారు. ఇక ఈ విద్యాసంవత్సరంలో 1000 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారా? లేక గతేడాది లాగా 1500 మందినే చేర్చుకుంటారా? అనేది తెలియడం లేదు.

నిధుల కొరత...

బాసర ట్రిపుల్‌ఐటీని నాలుగేళ్లుగా నిధుల కొరత వెంటాడుతోంది. కాంట్రాక్టర్లకు సంబంధించిన రెండు నెలల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధులు లేక విద్యార్థుల మౌలిక సౌకర్యాల ఏర్పాటులో ఆటంకం కలుగుతోంది. ఇందులో పనిచేసే ఉద్యోగుల వేతనాలు తప్పా మిగతా అన్ని చెల్లింపుల్లోనూ జాప్యం కనిపిస్తోంది. విద్యార్థులకు భోజన వసతి కల్పించే సంస్థలకు హౌజ్‌కీపింగ్, సెక్యూరిటీ, కాంట్రాక్టర్లకు ప్రతినెల రూ.4 కోట్ల నిధులు అవసరం. విద్యుత్ బిల్లులు, ఇతర అవసరాల కోసం రూ.2 నుంచి రూ.3 కోట్ల అవసరం ఉంటుంది. నిధుల కొరత కారణంగా బిల్లులు చెల్లించడం లేదు. విద్యార్థుల అవసరాల దృష్ట్యా కొన్నింటికి 15 రోజుల్లో మరికొన్ని నెలవారీగా బిల్లులు చెల్లించాలి. కానీ నిధులు లేక మూడు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదు. నిధులు లేక విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, యూనిఫామ్స్ సకాలంలో అందించలేకపోతున్నారు.

పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు

బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రూ.50 కోట్ల మేర స్కాలర్‌షిప్ నిధులు విడుదల కావాల్సి ఉంది. క్యాంపస్ అధికారులు బీసీ, ఎస్సీ, మైనార్టీ వెల్ఫేర్ శాఖల అధికారులను పలుమార్లు సంప్రదించినా నిధులు మాత్రం విడుదల చేయలేదు. ఏ విద్యాసంవత్సరానికి సంబంధించిన స్కాలర్‌షిప్‌లు అదే ఏడాది ఇవ్వాలి. కానీ నిధులు లేకపోవడంతో ఇవ్వడంలేదు.

ఈ ఏడాది మళ్లీ సమస్యలే!

ఈ విద్యాసంవత్సరంలో మళ్లీ సమస్యలే ఎదురుకానున్నాయి. నిధులు లేక నోటిఫికేషన్ ఆలస్యమవుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా చేరే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి. పైగా సీట్ల సంఖ్యపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఎన్ని సీట్లు భర్తీ చేయాలన్న విషయం క్యాంపస్ అధికారులు కూడా ప్రకటించడంలేదు. అధికారంలోకి రాకముందు ప్రతిపక్ష హోదాలో ట్రిపుల్‌ఐటీ సమస్యలపై పోరాడిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని పలువురు విమర్శిస్తున్నారు.

బడ్జెట్‌లోనూ అంతంతే...

బాసర ట్రిపుల్‌ఐటీకి ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో రూ. 30 కోట్ల వరకు కేటాయిస్తుంది. ఈ నిధుల్లో 50 శాతం మాత్రమే యూనివర్సిటీకి చేరుతున్నాయి. కేటాయించిన నిధులే యూనివర్సిటీకి సరిపోవడంలేదు. అందులోంచి 50 శాతమే విడుదలచేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రిపుల్ ఐటీకి సంబంధించిన డిపాజిట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. మిగులు నిధులను గతంలో పనిచేసిన అధికారులు దూర దృష్టితో యూనివర్సిటీ పేరిట డిపాజిట్లు చేశారు. క్యాంపస్‌లో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడల్లా ఈ డిపాజిట్లను డ్రాచేస్తున్నారు. రెండు నెలల కాలంలో రూ.8 కోట్లు డ్రా చేసినట్లు సమాచారం. మళ్లీ ఇప్పుడు డిపాజిట్ల వైపే చూస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగైదేళ్ల క్రితం రూ.300 కోట్లు ఉన్న డిపాజిట్లు ప్రస్తుతం రూ.20 కోట్లకు వచ్చినట్లు తెలుస్తోంది. నిధులు లేక ఈ డిపాజిట్లు కూడా కరిగిపోతున్నాయి.


ఉద్యోగుల వేతనాలు చెల్లిస్తున్నాం

ట్రిపుల్‌ఐటీలో పనిచేసే ఉద్యోగులకు వేతనాలు ఆపడంలేదు. ప్రతినెల వేతనాలు చెల్లిస్తున్నాం. నిధుల కొరత ఉన్నప్పటికీ ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. నిధుల కొరత వల్ల సంస్థలు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. త్వరలోనే నిధుల సమస్య తీరుతుంది.

– వెంకటరమణ, వీసీ, బాసర ట్రిపుల్‌ఐటీ

మాతృవేదన

- గర్భంలోనే శిశువు మృతి
- రూ.80వేల బిల్లు కోసం ప్రైవేట్ ఆస్పత్రి వేధింపులు
- కుటుంబీకుల ఆందోళన



డాక్టర్ ఇచ్చిన బిల్లు



బాధిత కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: మాతృత్వం ప్రతీ మహిళకు వరం లాంటిది.. అలాంటి మధురానుభూతిని పొందాల్సిన ఓ మహిళ ప్రైవేట్ ఆస్పత్రి ధనదాహంతో వేదనకు గురైన ఘటన కలచివేస్తోంది. సురక్ష ప్రసవం చేసి తల్లి, బిడ్డను కాపాడాల్సిన వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడ్డారు. గర్భంలోనే శిశువు మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ మాతృమూర్తికి ఓదార్పునివ్వాల్సింది పోయి బిల్లులు చెల్లించే దాకా ఆస్పత్రి నుంచి కదలనివ్వకుండా అడ్డుపడ్డారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం వెలుగు చూసింది. ప్రసవం కోసం రాష్ట్రం దాటి వచ్చిన ఆ దంపతులకు రూ.35వేలు ఖర్చవుతుందని తెలిపిన ఆస్పత్రి వైద్యులు, తీరా రూ.80వేల బిల్లు చేసి వాటిని బలవంతంగా వసూలు చేయడం ఆస్పత్రి ధన దాహానికి నిదర్శనం. డబ్బులు చెల్లిస్తే గాని డిశ్చార్జ్ చేయమన్న వైద్యుల తీరును అంతా అసహ్యించుకుంటున్నారు.

ఏం జరిగిందంటే..

ఆదిలాబాద్ పట్టణంలోని టీఎన్జీవో సమీపంలో ద్వారకానగర్‌లో గల ఓ గైనిక్ ఆస్పత్రిలో మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్ జిల్లా బీటర్‌గాంకు చెందిన లక్ష్మి డెలివరీ కోసం గతనెల 28న ఆస్పత్రిలో చేరింది. లక్ష్మికి రక్తం తక్కువగా ఉందని వైద్యురాలు సూచించారు. రక్తం ఎక్కించి డెలివరీ చేస్తామని చెప్పారు. ఇందుకు రూ.35వేల ఫీజు అవుతుందని కుటుంబీకులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అదేరోజు ఆమెకు సిజేరియన్ చేయగా గర్భంలోనే శిశువు మృతిచెందింది. అయితే ఈ చికిత్స కోసం మొదట ఆమె కుటుంబీకులు రూ.25వేలు ఆస్పత్రిలో చెల్లించారు. మిగతా రూ.10వేల కోసం ఆమె భర్త రామ్ స్వగ్రామానికి వెళ్లాడు. డబ్బులు లభించకపోవడంతో వారంపాటు ఆస్పత్రికి రాలేదు. గురువారం డబ్బులతో వచ్చిన రామ్ చెల్లించేందుకు కౌంటర్ వద్దకు వెళ్తే సిబ్బంది రూ.80వేల బిల్లు అయ్యిందని చూపించగా రామ్ ఖంగుతిన్నాడు. ఇదేమిటని అడిగితే 10 బాటిళ్ల వరకు రక్తం ఎక్కించామని, భోజనం పెట్టామని, డాక్టర్ ట్రీట్‌మెంట్ కోసం రూ.50వేలు, రక్తం ఎక్కించినందుకు రూ.10వేలు, మందుల కోసం రూ.10వేలు, సిబ్బంది పరిశీలన, ఇతర ఖర్చులు చూపించి రూ.10వేల బిల్లు చేసి ఇచ్చారు. వేడుకున్నప్పటికీ బిల్లు తగ్గించకుండా ససేమిరా అన్నారు. బిల్లు చెల్లించిన తర్వాతే తన భార్యను ఇంటికి తీసుకెళ్లాలని, అప్పటివరకు ఇక్కడే ఉంటుందని సిబ్బంది సూచించారు. మహారాష్ట్రకు చెందిన ఆ వ్యక్తికి ఇక్కడ బంధువులెవరూ లేరు. ఈ విషయం తెలుసుకున్న ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొందరు అక్కడికి వెళ్లి డాక్టర్‌ను నిలదీశారు. ఇదేమిటని అడిగితే ఆపరేషన్, ఇతర ఖర్చులకు రూ.80వేలు అవుతుందని చెప్పారు. కొంత ఆందోళన చోటుచేసుకోవడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. డాక్టర్‌ను ఒప్పించి కొంత డిస్కౌంట్ ఇప్పించి మిగతా డబ్బులు చెల్లించడంతో మహిళను డిశ్చార్జ్ చేశారు.

కార్మిక వ్యతిరేక పార్టీ బీజేపీ

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం, ఎమ్మెల్యే వివేక్

జైపూర్: దేశంలో మతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను 4కోడ్‌లుగా మార్చిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి మాట్లాడారు. రాజ్యాంగం మార్పు పేరుతో దేశాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీకి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని అన్నారు. అదానీ, అంబానీ వంటి ధనవంతులకు రూ.16లక్షల కోట్లు రుణమాఫీ చేసిన ప్రధాని సామాన్య ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కేబాజీ సైదా, సంయుక్త కార్యదర్శి సంపత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో దేశం వెనుకబడింది..

- బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జి మురళీధర్‌రావు
- మంచిర్యాలలో కార్నర్ మీటింగ్



మురళీధర్‌రావుకు నాయకుల స్వాగతం

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందని, నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాకనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ సీనియర్ నాయకులు, మధ్యప్రదేశ్ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మురళీధర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అధ్యక్షతన గురువారం మంచిర్యాలలో ఓవర్‌బ్రిడ్జి, ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, వెంకటేశ్వర టాకీస్, అర్చనటెక్స్ చౌరస్తాల మీదుగా శ్రీనివాస టాకీస్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో మురళీధర్‌రావు మాట్లాడారు. గత పదేళ్లుగా ప్రధాని మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి, దేశ అభివృద్ధి కోసం పనిచేస్తోందని తెలిపారు. దేశంలోని అన్ని రంగాల్లో మౌలిక వసతులు కల్పించి, దేశాభివృద్ధికి ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు ముల్కల్ల మల్లారెడ్డి, రజనీశ్‌జైన్, ఆనంద్ కృష్ణ, పానుగంటి మధు, తుల ఆంజనేయులు, రఘునందన్, కొయ్యాల ఏమాజి, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బోయిని హరికృష్ణ పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కేవీఎం శ్రీనివాస్ మంచిర్యాలలో మురళీధర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

మాన్కాపూర్‌లో మద్యపాన నిషేధం

- ఉల్లంఘిస్తే గ్రామబహిష్కరణ
- గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



సమావేశమైన గ్రామ పెద్దలు, గ్రామస్తులు

నార్నూర్: మద్యానికి బానిసై యువత చెడు మార్గాల వైపు వెళ్తున్న తరుణంలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాన్కాపూర్ గ్రామస్తులు ఓ నిర్ణయానికి వచ్చారు. గురువారం గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్ అధ్యక్షతన సమావేశమై గ్రామంలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మద్యం సేవించడంతో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు మర్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో చిన్నాపెద్దా తేడా లేకుండా మర్యాద కోల్పోతున్నారని తెలిపారు. గ్రామంలో ఎవరైనా మద్యం సేవించినా, విక్రయించినా గ్రామం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, సీతారాం, షెడ్మా రావు, బాధిరావు, కొట్నాక్ నానాజీ, భీంరావ్, ఎత్మారావు, సుంగు తదితరులున్నారు.

పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



గన్నేరువరం: పదేళ్ల బీజేపీ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా గన్నేరువరంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రచారం చేసి విలేకరులతో మాట్లాడారు. మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమంలో విఫలమైందన్నారు. దేశ భవిష్యత్‌కు సంబంధించి ఎన్నికలు కావడంతో ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీని ఓడించాలని కోరారు. రైతుచట్టాల రద్దుకు రైతులు ధర్నా చేపట్టినా కనికరం చూపలేదని, 750 మంది రైతులు మృతిచెందారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. వరవరరావుపై రాజద్రోహం కేసు, 90 శాతం వికలాంగుడైన సాయిబాబును జైల్లో పెట్టారన్నారు. బీఆర్‌ఎస్ అహంకార పాలన కొనసాగించిందని విమర్శించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. నియంతృత పాలనకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందన్నారు. బండి సంజయ్ చేసిందేమీ లేదన్నారు. కరీంనగర్, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల రద్దుకు మోదీ కుట్ర

కరీంనగర్ కార్పొరేషన్: రాజ్యాంగంతోపాటు రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం అనే అంశంపై పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ 400 ఎంపీలను గెలుచుకోవడం ద్వారా రాజ్యాంగాన్ని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ కుయుక్తులు పన్నుతోందన్నారు. ఈ కుట్రలపై ఆయా వర్గాల అప్రమత్తంగా ఉంటూ, ఓటు ద్వారా బుద్ధిచెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఎదుగుదలకు రిజర్వేషన్లు తప్పనిసరి అని, వాటిని నిరంతరం కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. నాయకులు సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మణ్, కొండ్ర సంపత్, స్వరూప, సముద్రాల లక్ష్మణ్, గోశిక శంకర్ ఉన్నారు.

ముందుంది ముప్పు.. ఎప్పుడో కనువిప్పు?

- సిరిసిల్లను వదలని వరదల భయం
- ఎండాకాలం వర్షాలకే ముంచెత్తుతున్న వరదలు
- వానాకాలంలో పరిస్థితిపై భయాందోళన
- నాలుగేళ్లుగా వీడని వరదల భయం
- లోతట్టు ప్రాంత వాసుల్లో ఆందోళన
- పూర్తి కాని వరదకాల్వల పనులు



ఈ ఫొటో గత జులైలో సిరిసిల్లలో కురిసిన భారీ వర్షానికి శ్రీనగర్, చుట్టుపక్కల కాలనీలు జలమయమయ్యాయి. గత వర్షాకాలంలో తొలకరి వర్షాలకే వరద పరిస్థితి ఇది. ప్రస్తుతం ఎండాకాలంలోనూ తరచూ భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో రానున్న వర్షాకాలంలో పరిస్థితిని ఊహించవచ్చు. వచ్చే వర్షాకాలం భారీ వర్షాలు పడితే పరిస్థితి ఏందని పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు.



ఇది గతేడాది వర్షాకాలంలో శాంతినగర్, సంజీవయ్యనగర్ లోతట్టు ప్రాంతాల్లోని దుస్థితి. ఈ దృశ్యం వర్షాకాలంలో ఏటా ఆవిష్కృతమవుతుంది. వరదకాల్వల పనులు పూర్తికాక ఇంకా లోతట్టు ప్రాంతాలు జలమయమవుతూనే ఉన్నాయి. వరదలు వచ్చినప్పుడు, ఓట్లప్పుడు మాత్రమే పాలకులు, అధికారులు ఇటొచ్చి సమస్య తీర్చుతామంటూ హామీలు గుప్పిస్తున్నారు. తర్వాత ఇటు వైపు చూడదం లేదు.

సిరిసిల్లటౌన్: వర్షాకాలం గుర్తొస్తే చాలు సిరిసిల్ల ప్రజలు వణికిపోతున్నారు. ఎండాకాలం వానలకే లోతట్టు ప్రాంతాల్లో వరద చేరుతుండడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. పట్టణం పైప్రాంతాల్లోంచి వచ్చే వరదనీరును కట్టడి చేయడంలో అధికారులు ఏళ్ల తరబడిగా కుస్తీ చేస్తూనే ఉన్నారు. కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. మూడు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వానలతో మరో ఇరవై రోజుల్లో ప్రారంభమయ్యే జూన్ వానలపై ప్రజలు భయం..భయంగా గడుపుతున్నారు. వరదల భయం వీడని సిరిసిల్ల ముంపు ప్రాంతాలపై 'సాక్షి' కథనం.

వదలని వరదలు

ఏటా వరదలు సిరిసిల్లను వదలడం లేదు. ఏళ్లగా ముంచెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన ఎండాకాలం వర్షానికే పట్టణంలో వరదనీరు రోడ్డుపై ఉధృతంగా పారింది. చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లే డ్రెయినేజీలు, నాలాలు కబ్జా కావడంతో చెరువుల్లో నిండిన నీరు బయటకు పోవడానికి పారే నీరు లోతట్టు ప్రాంతాలను పూర్తిగా ముంచేస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్‌లేక్, రాయినిచెరువు, తుమ్మలకుంట, కొత్తచెరువు తదితర చెరువులకు సంబంధించిన నాలాలు ఆక్రమణకు గురయ్యాయి. డబ్బు, పలుకుబడి ఉన్నవారు అధికారులపై ఒత్తిడి తెచ్చి నాలాలను కబ్జా చేశారు. ఈనేపథ్యంలో ఏటా వర్షాలు పడటం.. చెరువుల్లోకి వచ్చే నీరంతా మత్తడి దూకి పారే నాలాలు లేక రోడ్లపైకి, చెరువుల కింద ఉండే ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నాయి.

పూర్తికాని వరద కట్టడి పనులు

పట్టణంలోకి వరద రాకుండా రూ.2.50కోట్లతో రెండేళ్లుగా చేపడుతున్న పనులు పూర్తికాకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ నిధులతో వెంకంపేట వద్ద దోభీఘాట్, కలెక్టరేట్ భవనం సముదాయం సమీపంలో ప్రహరీ నిర్మాణాలు, వరదల తాకిడికి పాడయిన రోడ్లు, డ్రెయినేజీల రిపేర్లు, ఫుట్‌పాత్‌లు, బీటి రోడ్డు, కాల్వలు, కల్వర్టులు మరమ్మతులకు నిధులు కేటాయించి పనులు చేపట్టారు. వీటిలో శాంతినగర్ నుంచి శ్రీనగర్ ప్రాంతం గుండా వరదకాల్వ నిర్మాణం పనులు పూర్తికాలేదు. నాలాలు, డ్రెయినేజీల పనులు పూర్తికాకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్‌లో వరదలపై శాశ్వత పరిష్కార చర్యలు లేకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. చెరువుల ఆక్రమిత నాలాలు, మత్తడి కాల్వలు పునరుద్ధరిస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు చెబుతున్నారు.

సమస్యలు.. పరిష్కారాలు

- లోతట్టు ప్రాంతాల నుంచి వచ్చే నీరు రోడ్డుపైకి రాకుండా.. పటిష్ఠ కాల్వలు కట్టించి నేరుగా మానేరువాగులో కలిసేలా చేయాలి.
- ఇప్పటికే కబ్జాకు గురైన నాలాలను అధికారులు స్వాధీనం చేసుకుని వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.
- ప్రధాన డ్రెయినేజీలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి. మురికికాల్వల్లో సిల్టు పేరుకుపోకుండా నెలరోజులకోసారైన శుభ్రం చేయాలి.
- లోతట్టు ప్రాంతాలైన అంబికానగర్, వెంకంపేట, తారకరామానగర్, పద్మనగర్, అశోక్‌నగర్, అనంతనగర్, సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, ఆసిఫ్‌పుర, ఆటోనగర్, శాంతినగర్‌లలో వరద చేరకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలి.
- పట్టణాల్లోని చెరువులకు సంబంధించిన మత్తడి, నాలాలు పునరుద్ధరించాలి. లోతట్టు ప్రాంతాలకు ముంపు వాటిల్లకుండా ముందస్తు ప్రణాళికతో కొత్త నాలాలు నిర్మించాలి.
- పాతబస్టాండు సమీపంలో రూ.45లక్షలతో నిర్మించిన ప్రధాన డ్రెయినేజీ కాల్వ పైనుంచి వచ్చే వరద నీటిని రోడ్డుపైకి రానీయకుండా పునరుద్ధరించాలి.



గతేడాది సిరిసిల్ల పాతబస్టాండు ప్రాంతాన్ని ముంచెత్తిన వరద నీరు

వరదకాల్వ వదిలేశారు



కొత్తచెరువు నుంచి వచ్చే వరదనీరు పోయేందుకు కచ్చా వరదకాల్వను తవ్వి వదిలేశారు. రాబోయేది వర్షాకాలం. పిల్లలు ఆడుకుంటున్నారు. దీన్ని పూర్తి చేయకుంటే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు. వరదలు రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలి.

– అన్నారం శ్రీనివాస్, రైతు

ఆక్రమిత నాలాలు స్వాధీనం చేసుకోవాలి



కొత్త చెరువు నుంచి వచ్చే వరద, మత్తడి కాల్వలు కబ్జాకు గురయ్యాయి. ప్రభుత్వం గుర్తించి పునర్‌నిర్మించాలి. గతేడాది వరదల నివారణకు చేపట్టాల్సిన పనులకు రూ.15కోట్లు కేటాయించగా.. ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. శ్రీనగర్ వైపు వరదలు రాకుండా చంద్రంపేట ఎక్స్‌రోడ్ నుంచి మళ్లించాలి.

– కందాల నవీన్‌కుమార్, శ్రీనగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు

పొలాలు, ఇండ్లకు నష్టం



ఏటా సిరిసిల్లలో వరదలతో పొలాలు, ఇండ్లు మునుగుతున్నయి. పెద్ద వర్షాల సమయంలో రోజుల తరబడిగా ముంపులో మగ్గుతున్నాం. ఇప్పుడు తవ్విన తాత్కాలిక కచ్చా కాల్వ నుంచి నీరు పైకి వచ్చి కాలనీలన్నింటిని ముంచుతుంది. గతంలో మాదిరిగా వరదలు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

– జంగిటి రాజు, శాంతినగర్

పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పండి?

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో పదేళ్లు పనిచేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజల కోసం చేసిందేమిటో చెప్పాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం మంథని పరిధిలోని శ్రీపాదకాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి మాట్లాడారు. గాలి మోటార్లలో వచ్చి గాలి మాటలు చెప్పే వారి మాటలు నమ్మొద్దన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుందన్నారు. నాడు ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం జరిగిందని, రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడం ద్వారా పేద వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రైతులకు రుణమాఫీ, అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర పథకాలు అందిస్తామని అన్నారు.

శ్రీపాద కాలనీలో మిగిలిన పనులు పూర్తి

ఈ ప్రాంత ప్రజలు ప్రేమతో ఏర్పాటు చేసుకున్న కాలనీకి దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు పేరును నామకరణం చేస్తే కొంత మంది ఉద్దేశ్య పూర్వకంగా పేరు మార్చారని, పేరు మార్చినంత మాత్రాన అభిమానం దూరమవుతుందా అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాలనీలో మిగిలిన పోయిన పనులు పూర్తి చేస్తానని తెలిపారు. గోదావరిపై రూ.140 కోట్లతో నిర్మించే వంతెన ద్వారా కాలనీకి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు భారీ గజమాలతో సత్కరించారు.

ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

పెద్దపల్లి ఎంపీగా ఆశీర్వదిస్తే సేవకుడిగా పనిచేస్తానని, పార్లమెంట్ అభివృద్ధికి కేంద్రం నిధులు తీసుకొస్తానని కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ తెలిపారు. 13 మంది ఎంపీలతో కేసీఆర్ రాష్ట్రానికి ఏం అ భివృద్ధి చేయలేదని, ఆయన మాటలు నమ్మొద్దన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

మంథని నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Printed at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) 08461 - 222645, 222646, 222647, Fax: 08461 - 222649. RNI Regn No. TELTEL/2008/23795.